# ప్రాణం తీసిన పిచ్చితనం

ఎన్. లక్ష్మణరావు



**ధనుర్మాసం ఆరంభమయింది. పొలం పనులు ముమ్మరంగా వుండి ధాన్యం ఇంటికొచ్చే సమయం కావడంతో, వెంకటేశ్వరపురం గ్రామీణులందరూ పొలం పనుల్లో క్షణం తీరిక లేకుండా వున్నారు.** ఎప్పటిలా నిద్ర లేచిన వెంకటాద్రి, రత్నమ్మ దంపతులు తమ ఏకైక కుమారుడైన ఎనిమిదేళ్ళ రాజేష్‌ని నిద్ర లేపారు. "చూడు బాబూ! ఈ రోజు పొలం నుండి ధాన్యం ఇంటికొచ్చే రోజు. అందుచేత మేము ఈ రోజు సాయంకాలానికి కానీ తిరిగి ఇంటికి రాము. ఉట్టిమీద అన్నం, కూర పెట్టి వుంచాం. మధ్యాహ్నం మీ తాతయ్యకు అన్నం పెట్టి నువ్వు తిను" అన్నారు వారు పొలం వెళుతూ. తెల్లవారుఝాము సమయం కావడంతో చిరాకేసి లేచిన రాజేష్ ఆవలిస్తూ "అలాగే" నంటూ మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు.

ఆ గ్రామంలోనే వుంటున్న పిచ్చివాడైన బషీర్ తన వికృత చేష్టలకు విసిగి వేసారి పోయిన అతని భార్య కరీనా అతన్ని వదిలి పుట్టింటికెళ్ళింది. అప్పటి నుండి ఇంకా మతి స్థిమితం కోల్పోయిన బషీర్ ఎవరూ గమనించనప్పుడు ఊళ్ళోని కోళ్ళని పట్టి వాటి గొంతు కొరికి రక్తాన్ని నోటితో పీల్చేవాడు. ఆ చర్య అతనికెంతో ఆనందాన్ని ఇచ్చేది. అప్పుడప్పుడు బావి దగ్గర నీళ్ళు తోడుతున్న స్త్రీల ముందుకెళ్ళి ఉన్నపళంగా తన వంటిమీదున్న పంచెను విప్పేసి దిగంబరంగా కనిపించేవాడు. దాంతో భీతిల్లినవారు ఖాళీ బిందెలతో తమ ఇళ్ళకేసి పరుగులు తీస్తూంటే, బషీర్‌లోని రాక్షసతత్వానికి పరాకాష్టగా మారేది. బషీర్ సంగతి తెలిసిన గ్రామస్తులు చెవిటివాని ముందు శంఖం ఊదిన చందంగా, పిచ్చివానికి ఏం చెప్పినా ప్రయోజనమేమిటనే ధోరణి వ్యక్తమవడంతో అతని వెకిలి చేష్టలు భరిస్తూ మిన్నకుండేవారు. దాంతో బషీర్ తానేం చేసినా చెల్లుబాటు అవుతుందనే నైజం అతనిలో బలంగా నాటుకుపోయింది.


నిద్రలేచిన రాజేష్ కాలకృత్యాలను తీర్చుకుని, చద్ది అన్నాన్ని తిని తోటివారితో ఆడుకోవడానికి బయటికెళ్ళాడు. ఆ రోజు ఆదివారం. పాఠశాల విద్యార్థులకు ఆటవిడుపు కావడంతో రాజేష్ సమవయస్కులందరూ వీధిలో ఆడుకోసాగారు. రాజేష్ వెళ్ళి వారి దొంగాటలో తమా పాలు పంచుకున్నాడు. వారి ఆటలను దూరం నుండి బషీర్ చూసి వారి దగ్గరకొచ్చాడు. అది గమనించిన పిల్లలు బిలబిలమంటూ ఎవరిళ్ళకి వారెళ్ళారు. రాజేష్ మాత్రం బషీర్‌ని పట్టించుకోకుండా ఏదో కూనిరాగం తీయసాగాడు. బషీర్ చుట్టుపక్కల కలయచూడగా ఎవరూ లేకపోవడంతో రాజేష్‌ని మెల్లగా మాటల్లోకి దింపాడు. "ఊరికి దూరంగా వుండే తిప్ప దగ్గరున్న రేగుపండ్లు చాలా బాగుంటాయి, నీకు కావలసినన్ని కోసిస్తాను. నాతో వస్తావా?" అడిగాడు బషీర్ అక్కణ్ణించి వెళుతూ. కల్లా కపటమెరుగని రాజేష్ బషీర్ మాటలకు ఆశపడి అతన్ని అనుసరించాడు.

తిప్ప మీదికి చేరి రేగుఫండ్లని ఎంతో ఆశగా చూస్తున్న రాజేష్‌ను వెనుక వున్న బషీర్ తన జేబులోని నులకతాడుని బయటకు తీసి ఒక్క ఉదుటున రాజేష్ పెడరెక్కలు వెనక్కి విరిచి కట్టివేశాడు. దాంతో తూలి కిందపడి పోయిన రాజేష్ కాళ్ళు కూడా బంధించాడు. జరిగిన ఆ హఠాత్పరిణామానికి నిశ్చేష్టుడైన రాజేష్‌కి నోట మాట రాక బిత్తరచూపులు చూడసాగాడు. పిచ్చి ముదిరిన బషీర్ ప్రక్కనున్న సన్నని పొడవాటి వాడియైన తెల్ల రాయిని చేతిలోకి వాటంగా తీసుకున్నాడు. అది గమనించిన రాజేష్ చిగురుటాకులా వణికి

పోయాడు. రాజేష్ ఛాతీమీద కూర్చున్న బషీర్ ఓ చేత్తో వాడి జుట్టు పట్టుకుని కదలకుండా చేసి, మరో చేత్తో ఆ పదునైన రాయితో కసకసా గొంతుని కోశాడు. నునులేతయైన ఆ బాలుడి కంఠం నుండి నులివెచ్చని రక్తం ఎగచిమ్మగా నరరూప రాక్షసుడిలా బషీర్ ఒక్క చుక్క కూడా కింద పడకుండా పీల్చివేశాడు. అంతలోనే బంధీయైన రాజేష్ ప్రాణం గిలగిలలాడుతూ అనంతవాయువుల్లో కలిసి పోయింది.

సాయంత్రానికి ధాన్యంతో ఇల్లు చేరిన వెంకటాద్రి దంపతులకు కొడుకు రాజేష్ కాన రాకపోవడంతో కీడుని శంకించారు. మంచం లోని రోగిష్టియైన వెంకటాద్రి తండ్రిని విచారిం చగా, తనకేమీ తెలియదని చేతులతోనే సైగ చేశాడు. ఇరుగుపొరుగువారిని వాకబు చేయగా, తమకేమీ తెలియదన్న సమాచారం వారినెంతో నిరాశపరిచింది. ఊరంతా గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం కాన రాలేదు. రాజేష్ అతని సమవయస్కులు ఉద యం వారాడుకున్న దొంగాట విషయం, అక్క డకు పిచ్చివాడైన బషీర్ రావడాన్ని గురించి రాజేష్ స్నేహితుడొకడు వెంకటాద్రి దంపతు లకు తెలియజేశాడు.

దాంతో గ్రామంలోని యువకులు కొం దరు బషీర్ దగ్గరకెళ్ళి రాజేష్‌ని గురించి ఆరా తీశారు. మొదట తనకేమీ తెలియదని బుకా యించిన బషీర్ వీపుమీద నాలుగు చరిచేసరికి నిజం ఒప్పుకున్నాడు. డబ్బులిస్తామని ఆశ పెట్టగా, రాజేష్ తల్లితండ్రులను, కొందరు యువకులను బషీర్ రాజేష్‌ని హత్యగావించిన స్థలానికి తీసుకెళ్ళాడు. అక్కడ నిర్జీవంగా పడివున్న తమ కుమారుడు రాజేష్‌ని చూసి ఆ దంపతులు గుండెలవిసేలా రోధించడం అక్క డున్న యువకులను కంటతడి పెట్టించింది. ఆవేశం పట్టలేని ఆ యువకులు బషీర్ పెడ రెక్కలు వెనక్కి విరిచి బంధించి, ఈడ్చుకుంటూ తీసుకెళ్ళి రక్షకభటులకు అప్పగించారు. ఓ పిచ్చివాడి ఘాతుకానికి అన్నెం పున్నెం ఎరుగని పసివాడు బలికావడం ఆ ఊరివారందరినీ ఎంతగానో మనస్తాపానికి గురిచేసింది. ❋



భార్య మెయిటీతో
శక్తీ బర్మన్

# మార్మిక చిత్రకారుడు

చూడబడేది, చూసేవాడూ, చూపును ప్రసారం చేసే మాధ్యమం సక్రమంగా వుంటే అది కళాఖండమే అవుతుంది. ప్రకృతి మారదు. కానీ ప్రకృతిని చిత్రించే చిత్రకారులు మారుతారు. ఒక్కొక్కరికీ ఒక్కొక్క దృక్పథం వుంటుంది. ఒక్కొక్కరూ ఒక్కొక్క మాధ్యమాన్ని ఎన్నుకుంటారు. ఏది ఏమయినా చిత్రలేఖనం కళ ఆర్టిస్టు పటిమను బట్టే కాక వీక్షకుల మనోస్పందనను బట్టే ఆధారపడి వుంటుంది. ఒక బొమ్మలోని భావాలు, వర్ణాలు, రేఖలు, ఆకర్షణీయంగా వున్నాయనుకోండి, ప్రేక్షకులు ఆ చిత్రాన్ని పదేపదే చూస్తారు. కళాభిమానులు, కళాపోషకులు కొనటానికి ముందుకు వస్తారు. అంతటి ఆకర్షణగల చిత్రాలు రచించిన బెంగాలీ చిత్రకారుడు శ్రీ శక్తీ బర్మన్, కళాభిమాని అయిన మెయిటీ అనే పాశ్చాత్య స్త్రీని వివాహం చేసుకున్నాడు. శక్తీ బర్మన్ చిత్రాల్లో మానవులు, సామాన్యులూ ఊహించలేని నేపథ్యాలుంటాయి.

గ్రీకు, గోతిక్ చిత్ర ప్రక్రియల ప్రభావం ప్రస్ఫుటంగానే కనిపించినా శక్తికి తనదైన ఒక మార్మిక, అధివాస్తవికత, అయిన విశిష్ట శైలి వుంది. ఫ్రాన్స్‌లో స్థిరపడిన ఈ భారతీయ చిత్రకారునికి గ్రీకు, లాటిన్, పురాణ గాథలను వివరించటంలో భార్య మెయిటీ శ్రద్ధ తీసుకుంది. అనతికాలంలోనే శ్రీ శక్తీ బర్మన్ ప్రఖ్యాత చిత్రకారుడయిపోయాడు. అతడు నిర్వహించిన ప్రదర్శనలలో (ఆర్ట్ షో) దాదాపు ముప్పాతిక వంతు చిత్రాలు హాట్ కేక్స్‌లా అమ్ముడుపోతాయి. ఫ్రెంచివాళ్ళు సున్నితులు, కళాప్రియులు, చిత్ర కళాభిమానులు. వారి హృదయాలకు ఆర్ద్రత ఎక్కువ. చిత్రాలలోని గీతలను, రంగులనూ, ఇతివృత్తాన్నీ చూసిన వెంటనే వారి మనస్సు తీవ్రంగా స్పందించి సానుభూతితో ద్రవించటం మొదలవుతుంది. ఆర్ట్ ఫ్రేమ్స్ వేలం వేస్తారు. వేలం పాటలో ఎవరు ఎక్కువ ధనం వెచ్చిస్తే వారికి ఆ పెయింటింగ్ దక్కుతుంది. ఇటీవల ఒక పికాసో పెయింటింగ్‌కి అయిదు కోట్లు ధర పలికింది. పేరుమోసిన వ్యాపారవేత్త, ప్రపంచ ప్రసిద్ధ వాణిజ్యవేత్త దానిని కొని తన కార్పొరేట్ ఆఫీస్ లాంజ్‌లో గోడకు వేలాడదీసి సంతోషంతో పొంగిపోయాడు. కానీ ఆయన ఆనందం అట్టేకాలం నిలవలేదు. కారణం ఆశ్చర్యం కొలుపుతుంది. అది అసలు పికాసో వేసిన చిత్రం కాదు. పికాసో వేసిన ఒక చిత్రాన్ని దగ్గరపెట్టుకుని ఓ మహానుభావుడు వాటికి డూప్లికేట్ చిత్రాలు తీస్తున్నాడు. ఇలాంటి పికాసో చిత్రాలకు విపరీతమైన గిరాకీ పెరిగిపోయింది. లేత రంగులు వాడటం, దేవతలను సామాన్యులుగా చిత్రీకరించటం ఈయన ప్రత్యేకతలు. వీరి చిత్రాల్లో ఏదో తెలియని మార్మికత గోచరిస్తుంది. ప్రాచ్య పశ్చిమాల కలయిక వల్ల ఉత్పన్నమైన నూతన హైబ్రిడ్ సంస్కృతి అంతర్లీనంగా కనిపిస్తుంది. వివిధ వర్ణాలను జిగ్‌జాగ్‌గా చిత్రీకరించి మొజాయిక్ నేపథ్యం సృష్టించటం శక్తికి ఇష్టమైన ప్రక్రియ. నేపథ్యానికి (బ్యాక్ డ్రాప్) ఒకే రంగు వాడితే అది ఫోటోలాగా తయారవుతుంది. పెయింటింగ్ లాగా కనిపించదు అనేది శక్తీ బర్మన్ అభిప్రాయం.

– రాధామనోహరన్



శక్తీ బర్మన్
అపూర్వ చిత్రం